క్లుప్తంగా

ఎమ్మెల్యేలను కలసిన కృష్ణప్రియ



ఎమ్మెల్యే ద్వారంపూడిని కలసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న కృష్ణప్రియ

కాకినాడ: వైఎస్సార్‌సీపీ జిల్లా ఐటీ సెల్ అధ్యక్షురాలిగా నియమితురాలైన బీర కృష్ణప్రియ బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కృష్ణప్రియను ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

22న బభ్రువాహన నాటక ప్రదర్శన

బోట్‌క్లబ్: దంటు సూర్యారావు స్మారక నాటకోత్సవాల్లో భాగంగా ఈ నెల 22న దంటు కళాక్షేత్రంలో సాయంత్రం ఐదు గంటలకు బభ్రువాహన పద్యనాటకం ప్రదర్శిస్తున్నట్టు యంగ్మెన్స్ హ్యాపీక్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాటకాభిమానులు అందరూ పాల్గొని ఈ కార్యక్రమంలో జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మహిళాభ్యున్నతికి కృషి



మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న లయన్స్ ప్రొఫెషనల్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: నిరుపేద మహిళల అభ్యున్నతికి లయన్స్ ప్రొఫెషనల్ క్లబ్ సభ్యులు చేస్తున్న కృషి మరువలేనిదని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ అన్నారు. స్థానిక కుసుమ సత్య ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిరుపేద మహిళలకు క్లబ్ అధ్యక్షులు ద్వారంపూడి విపుల్ ఆధ్యక్షతన కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో క్లబ్ సభ్యులు పలు ఆరోగ్య సంరక్షణ శిబిరాలు, రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమాలను అభినందించారు. అనంతరం వలసపాకలకు చెందిన ఇద్దరు మహిళలకు కుట్టు మెషీన్లు అందించారు. ప్రముఖ దంత వైద్యులు అద్దాల సత్యనారాయణ, క్లబ్ సభ్యులు రవికుమార్, చంద్రశేఖర్, నల్లం భాస్కర్, నిమ్మకాయల వేంకటేశ్వరరావు, మోహనరావు, చిట్నీడి శ్రీనివాస్, ముంజులూరి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర రగ్బీజట్టుకు అజయ్ ఎంపిక



అజయ్‌తో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విత్తనాల అజయ్ రాష్ట్ర రగ్బీ జట్టుకు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ మంగళవారం తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం భువనేశ్వర్‌లోని నవీన్ పట్నాయక్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు జరిగే 67వ అఖిల భారత స్కూల్‌గేమ్స్ అండర్-14 విభాగంలో రగ్బీ ఆటల పోటీలలో రాష్ట్రజట్టు తరపున అజయ్ ఆడతారన్నారు. ఆటల పోటీలలో పాల్గొనేందుకు వెళ్తున్న అజయ్‌ను మంగళవారం హెచ్‌ఎం సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ కె.నాగలింగేశ్వరరావు, వీవీ రమణమూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

రోగ నిరోధక శక్తి పెంచుకోవాలి



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో పేదలకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ సువర్ణరాజు

కాకినాడ రూరల్: వైరస్‌లు విజృంభిస్తున్నందున రోగ నిరోధక శక్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని డాక్టర్ సువర్ణరాజు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో డాక్టరు సువర్ణరాజు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళలో కరోనా వైరస్ విజృంభిస్తోందని, ఎక్కువ మంది కీళ్ల సంబంధ సమస్యలతో బాధ పడుతున్నందున సరైన పోషకాహారం తీసుకుని రోగ నిరోధిక శక్తిని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, శిరీష తదితరులు పాల్గొన్నారు.

వారి భవిత ఉజ్వలం

- ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- అత్యుత్తమ కంటెంట్ ఉన్న ట్యాబ్‌ల పంపిణీ
- అర్బన్‌లో 32 మందికి రూరల్‌లో 35 మందికి అందజేత



ట్యాబ్‌ల పంపిణీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కృత్తికాశుక్లా, ఆర్‌జేడీ నాగమణి (ఫైల్)

బాలాజీచెరువు: వారంతా మూగ, చెవిటి, చూపు తక్కువ, పూర్తిగా కనబడని పిల్లలు. అయితేనేం అందరితో పాటే తామూ దేనిలోనూ తీసిపోమని నిరూపించుకుంటున్నారు. ప్రభుత్వ సహకారంతో భవిత కేంద్రాల్లో ఉంటూ చక్కగా విద్యాభ్యాసం చేస్తున్నారు. ఆ విద్యార్థులు మరింత ఉత్తమంగా ఎదిగేలా ఉన్నత భవితకు బాటలు వేసుకునేలా సహకారం అందించాలని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు అత్యుత్తమ కంటెంట్ నిక్షిప్తం చేసిన ట్యాబ్‌లు పంపిణీ చేసింది. వెరసి పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు ఈ కేంద్రాలు చిరునామాగా నిలుస్తున్నాయి.

విప్లవాత్మక సంస్కరణల ఒరవడి

విద్యార్థులకు అన్ని రకాలుగా సీఎం జగన్ అండగా నిలుస్తున్నారు. కాకినాడ నగరంతో పాటు రూరల్ నియోజకవర్గంలో ఉన్న భవిత కేంద్రాల్లో 65 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. వీరి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోంది. వారికి కావలసిన మెటీరియల్ అందజేస్తున్నారు. దీంతో పాటు ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారు. మూగ, చెవిటి, దృష్టిలోపం పూర్తిగా కనబడని వారు సైతం సాధారణ విద్యార్థుల్లా ఉన్నత విద్యను చదవాలనే ఉద్దేశంతో ఆధునిక సాంకేతికతతో కూడిన ట్యాబ్‌ను ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అందజేశారు. ఒక్కో ట్యాబ్ రూ.29వేలు, కీబోర్డు 8 వేలు విలువ చేస్తోంది. ఆయా కేటగిరీల చిన్నారులకు సులభంగా చదువుకోవడానికి వీలుగా ట్యాబ్‌లకు రూపకల్పన చేశారు. ఇటీవల ట్యాబ్‌లను కలెక్టర్ కృత్తికా శుక్లా తన చాంబర్‌లో కొందరికి అందజేసి ప్రారంభించారు.

దివ్యాంగ విద్యార్థులకు వరం..



దివ్యాంగ విద్యార్థులను ప్రభుత్వం ఇప్పటికే అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ తాజాగా ట్యాబ్‌లు అందజేసి టెక్నాలజీకు మరింత దగ్గర చేస్తోంది. వైద్య సేవలతోపాటు ఆర్థికంగా తోడ్పాటు ఇస్తూ విద్యాపరంగా మరో అడుగు ముందుకు వేసి వారికి ట్యాబ్‌లు అందజేసింది. ఇటీవలే ఉపాధ్యాయులకు వీటిపై పీఆర్ కళాశాలలో ఒరియంటేషన్ కల్పించాము. అర్బన్‌లో 32 మందికి, రూరల్‌లో 35 మందికి ఈ ట్యాబ్‌లను అందజేశాం.

– చామంతి నాగేశ్వరరావు, సీఎంఓ, సమగ్ర శిక్ష అభియాన్

ఓటుపై విస్తృత ప్రచారం

- నేడు నగరంలో బైక్ ర్యాలీ
- ప్రారంభించనున్న కలెక్టర్



సమీక్షిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు బుధవారం ఉదయం 9 గంటలకు నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఈఆర్‌ఓ, కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక రాజా ట్యాంక్ పార్క్ ఆవరణలోని కళాక్షేత్రం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీని కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి డాక్టర్ కృతికాశుక్లా ప్రారంభిస్తారన్నారు. ర్యాలీ నిర్వహణపై మంగళవారం తన చాంబర్ లో కార్పొరేషన్ అధికారులలు, ఏఈఆర్వోలతో సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజా ట్యాంక్ నుంచి టూ టౌన్ పోలీస్ స్టేషన్, టౌన్ హాల్, మసీద్ సెంటర్, గోల్డ్ మార్కెట్ సెంటర్ జగన్నాథపురం వంతెన, ఎన్టీఆర్ వారధి, దేవాలయం వీధి, త్రిపుర సుందరి ఆలయం, టూ టౌన్ ఓవర్ బ్రిడ్జి మీదుగా భానుగుడి జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ఓటు ప్రతి ఒక్క పౌరుని హక్కు- బాధ్యతగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. సచివాలయ కార్యదర్శులు, కార్పొరేషన్ ప్రత్యేకాధికారులు, నోడల్ అధికారులు, ఇతర ఉద్యోగులు బైక్ ర్యాలీలో పాల్గొంటారన్నారు. మైకులు, బ్యానర్లతో పాటు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తామన్నారు. అలాగే ఈ నెల 21వ తేదీ మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు స్థానిక ఆనందభారతి గ్రౌండ్స్‌లో రంగవల్లుల పోటీలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని కూడా ఓటర్లలో చైతన్యం కలిగించేందుకేనని స్పష్టం చేశారు. రంగవల్లుల పోటీలో గెలుపొందిన విజేతలకు ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు కూడా అందిస్తామన్నారు. రంగవల్లుల పోటీలలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన మహిళలు కార్పొరేషన్ టోల్ ఫ్రీ నెంబర్ 1800 4255 990ను సంప్రదించి బుధవారం సాయంత్రం లోపుగా పేర్లు నమోదు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, నగరపాలక సంస్థ మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్, ఏఈఆర్‌ఓ మురళీకృష్ణ, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసం బురద చల్లొద్దు

- జనసేన నేత నానాజీకి జెడ్పీటీసీ రామకృష్ణ హితవు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రామకృష్ణ

కాకినాడ రూరల్: రాజకీయ లబ్ధి కోసం బురద చల్లే అలవాటు మానుకోవాలని జనసేన నాయకుడు పంతం నానాజీకి వైఎస్సార్ సీపీ నేత, కాకినాడ రూరల్ జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ హితవు పలికారు. వలసపాకల గ్రామంలోని తన స్వగృహంలో మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. సోమవారం వలసపాకలలో నానాజీ పర్యటించిన 19 వినతులు వచ్చాయని, 619 మందికి పట్టాలు ఇచ్చారని, స్థలాలు చూపలేదని, సొమ్ములు వసూలు చేసినట్టు, గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం బాగా లేదని ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్‌ను చదివారన్నారని జెడ్పీటీసీ పేర్కొన్నారు. రాత్రులు కాదు పగలు వస్తే గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూపుతామన్నారు. తాము గ్రామంలోని లబ్ధిదారులకు 836 పట్టాలు ఇచ్చామని, ఇందులో జనసేన కార్యకర్తలు సైతం ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కులం, మతం, పార్టీలు చూడకుండా అర్హులందరికీ పట్టాలు ఇచ్చారని, స్థలాలు కూడా అప్పగించామన్నారు. కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. మీతో తిరిగిన వారిలో పట్టాలు పొందిని వారిని అడగండి సొమ్ములు ఇచ్చారో లేదో అని ప్రశ్నించడంతో పాటు జనసేనకు చెందిన లబ్ధిదారు సానా అనంతలక్ష్మి భర్త నాగుకు ఫోన్ చేసి నీ పట్టాకు నేను డబ్బులు తీసుకున్నావా అని ప్రశ్నించారు. తీసుకోలేదని జనసేన కార్యకర్త సమాధానం చెప్పారు. బురద జల్లే ముందు ఒక వ్యక్తి ఎలాంటి వాడో తెలుసుకోవాలన్నారు. తమ నాయకుడు, ఎమ్మెల్యే కన్నబాబు కుటుంబ సభ్యులపై మాట్లాడడం మానుకోవాలన్నారు. కాకినాడలో పోటీ చేస్తే జెడ్పీటీసీగా నాకు వచ్చిన మెజార్టీ అన్ని ఓట్లు నీకు రాలేదని నానాజీని ఉద్దేశించి అన్నారు. బీసీ, ఎస్సీలు అంటే మీకు చులకన అని, కనీసం కూడా ఉన్న కాపులను లెక్క చేయవన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణంరాజు, రెడ్డి నాయుడు, విశాఖ కుమార్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దగాకోరు పార్టీలను నమ్మొద్దు

వై ఏపీ నీడ్స్ జగన్‌లో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: అధికారంలో ఉన్నంతసేపు ప్రజా సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోని తెలుగుదేశం పార్టీ ఎన్నికలు దగ్గర పెట్టుకోవడంతో జనసేనతో పొత్తు పెట్టుకుని ప్రజలను వంచించేందుకు ప్రయత్నిస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. స్థానిక 13వ డివిజన్ రెవెన్యూకాలనీ ప్రాంతంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల లబ్ధిదారులకు సంబంధించిన ప్రదర్శన బోర్డును ఎమ్మెల్యే ద్వారంపూడి ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఇతర నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లో పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోను సైతం తుంగలోకి తొక్కి, వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘన చరిత్ర తెలుగుదేశం పార్టీదన్నారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన తెలుగుదేశం పార్టీ అధికారాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుని ప్రజలను దగా చేయాలని చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు నమ్మి మోసపోవద్దని కోరారు. అభివృద్ధి, సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ఆయనను మరోసారి గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, స్థానిక నాయకులు అస్గర్, నాగిరెడ్డి, శ్రీను, సత్య, గుద్రాల ప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేసిన మేలు గుర్తించి ఆశీర్వదించండి

కరప: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన నవరత్న, సంక్షేమ పథకాల ద్వారా పేదవర్గాలకు చేసిన మేలును గుర్తించి, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి కోరారు. మండలం నడకుదురులో మంగళవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చారన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో, సంక్షేమ పథకాలు అమలుచేయడంలో జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబును వచ్చే ఎన్నికల్లో గెలిపించడం ద్వారా జగనన్నకు మద్దతు తెలపాలన్నారు. నోడల్ అధికారి ఎస్వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలను, సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ సర్పంచ్ దేగల లలితకుమారి మాట్లాడుతూ నడకుదురు-1 గ్రామ సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.26.29 కోట్లు ప్రభుత్వం మంజూరుచేసిందని తెలిపి, గ్రామంలో చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. ముందుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. తర్వాత గ్రామ కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను నాయకులు ఎగురవేశారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, ఎంపీటీసీలు పైలా రామతులసి, ముమ్మిడి బుచ్చిరాజు, జి.భావారం, కరప, వేములవాడ సర్పంచ్‌లు రొక్కాల గణేష్, సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, పైలా గోవిందు, వై.కృష్ణార్జున, జవ్వాది సతీష్, పోతల లోవప్రసాద్, కార్యదర్శి పీఎస్‌వీఆర్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.



నడకుదురులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు



నడకుదురులో వలంటీర్లకు బుక్‌లెట్లను అందజేస్తున్న నాయకులు

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



కూరాడలో లబ్ధిదారులకు ఆయుష్మాన్‌భవ కార్డులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కరప: మండలం కూరాడ, పెదకొత్తూరు గ్రామాల్లో మంగళవారం మండలస్థాయి అధికారులు, బీజేపీ నాయకులు పర్యటించి వికసిత్ భారత సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న 20 రకాల పథకాలను వివరించి, ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు రాని వారుంటే, తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. తర్వాత ఉచిత గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్‌భవ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. దేశనాయకుల వేషధారణతో పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. బీజేపీ కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్, కో ఆర్డినేటర్ పుట్టా వీరప్రసాద్‌గాంధీ, సర్పంచ్‌లు వాసంశెట్టి కొండ, చింతా నాగలక్ష్మి, ఉపసర్పంచ్ రావుల చంద్రావతి, ఎంఈఓ- పి.సత్యనారాయణ, వేళంగి పీహెచ్‌సీ డాక్టర్ ఎంకే సౌజన్య, హౌసింగ్ ఏఈఈ ఎస్.రాంబాబు, ఏపీఓ ఈ.వెంకటరమణ, కార్యదర్శులు ఎం.చక్రపాణి, పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

వైద్య శిబిరంలో ఎమ్మెల్యే ద్వారంపూడి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

కాకినాడ: కార్మికులు ఆరోగ్యంపై కూడా దృష్టిసారించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సూచించారు. ది కాకినాడ పోర్టు వర్కర్స్ పూల్, ఈఎస్‌ఐ ఆస్పత్రుల ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెమటోడ్చి పనిచేసే కార్మిక కుటుంబాల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక దృష్టిసారించాలని, వీరి కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషదాయకమన్నారు. కార్మిక వర్గాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కోకనాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వీవీ రాఘవులు, పోర్టు వర్కర్స్ స్కూల్ అధ్యక్షుడు ఏవీ చలం, కార్యదర్శి పీవీ రావు, కస్టమ్స్ బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, స్టీవ్‌డోర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదం మహేష్, డీప్ వాటర్ పోర్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పట్టా ధనలక్ష్మి, బలసాడి వీరబాబు, వినాయక యూనియన్ ప్రతినిధి పినపోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

పోషకాల పెన్నిధి తాటి బెల్లం



పిఠాపురంలో తాటిబెల్లం విక్రయిస్తున్న వ్యాపారి

పిఠాపురం: తాటి చెట్టు ఉపయోగాలు అన్ని ఇన్నీ కాదు. తాటి కల్లు నుంచి ముంజెలు, తాటి కాయలు, తాటితాండ్ర, తేగలు వంటి తినడానికి ఉపయోగపడితే వాటి బెరడు, ఆకులు ఇంటి నిర్మాణాలకు ఉపయోగిస్తారు. ఇలా తాటి చెట్టు బెరడు నుంచి ఆకుల వరకు అన్నీ మానవునికి ఉపయోగపడేవే. అలాంటి తాటి కల్లు నుంచి తయారు చేసే బెల్లానికి ఎనలేని గిరాకీ ఉంది. కుండకు సున్నం రాయడం ద్వారా అందులో పడే కల్లుకు తీయదనం వస్తుందని దానిని నీరా అంటారని వ్యాపారి చెప్పారు. పంచదారకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే ఆరోగ్య ప్రదాయనిగా చెప్పబడే బెల్లానికి ప్రస్తుతం మంచి గిరాకీ ఉంది. ఎక్కువగా తమిళనాడుకు చెందిన వ్యాపారులు మన జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, కాకినాడ, రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల్లోని మెయిన్ రోడ్లపై తాటి బెల్లాన్ని విక్రయిస్తున్నారు. మామూలు బెల్లం కిలో రూ.50 వరకు ఉండగా తాటిబెల్లం కిలో రూ.140, మిరియాలు అల్లం వంటివి కలిపి తయారు చేసిన తాటిబెల్లం కిలో రూ.250 వరకు విక్రయిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి ప్రాంతంలో ఎక్కువగా ఈ బెల్లం తయారు చేస్తుంటామని అక్కడి నుంచి లారీలపై బెల్లం తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నామని ఆ ప్రాంతానికి చెందిన రైతు వీరన్ తెలిపాడు.

దరఖాస్తుల పరిష్కారంలో జిల్లాలో కాకినాడ ముందంజ

ఈఆర్వో నాగ నరసింహారావు



సమావేశంలో కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ-2024లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంలో జిల్లాలో కాకినాడ సిటీ నియోజకవర్గం అగ్రస్థానంలో ఉందని ఈఆర్‌ఓ, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారంపై మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫారం 6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రగతిని ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. వచ్చిన 1,08,521 దరఖాస్తుల్లో దాదాపు 94,676 పరిష్కరించామన్నారు. 10,990 దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొత్త ఓటర్ల నమోదు, నాన్ ట్రేస్డ్ ఓటర్లకు సంబంధించి రిజిస్టర్ పోస్ట్ ద్వారా పంపించిన నోటీసుల వివరాలు, మార్పులు చేర్పుల సమాచారాన్ని ఆయన నాయకులకు వివరించారు. ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, ముగ్గుల పోటీలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ) డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఏఈఆర్వోలు హరిదాసు, మురళీకృష్ణ, నాగ శాస్త్రులు, వరహాలయ్య పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే కన్నబాబు పరామర్శ



జీజీహెచ్‌లో రోగి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప/కాకినాడ క్రైం: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వారు కాకినాడ ప్రభుత్వాసుపత్రి, ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న వారిని మంగళవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్థానిక నాయకులతో కలసి పలకరించి, ధైర్యం చెప్పారు. గొర్రిపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు ఊబా కిశోర్ రోడ్డు ప్రమాదంలో గాయపడి, ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. కరప గ్రామానికి చెందిన కె.వరలక్ష్మి, కె.శృతి, వాకాడ గ్రామానికి చెందిన లకమన బుల్లి అప్పన్నలు రోడ్డుప్రమాదంలో గాయపడగా కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని ఎమ్మెల్యే కురసాల పరామర్శించి, మెరుగైన వైద్యసేవలందించాలని సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారికి సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు వజ్రపు కామేశ్వరరావు, నక్కా సత్తిబాబు, అడబాల ప్రసాద్, వి.ఈశ్వరరావు, వాకాడ ఎంపీటీసీ చెక్కపల్లి ఫకీర్రావు తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

షాపుల ఏర్పాటుకు టెండర్ల ఆహ్వానం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ఏడాది పాటు తాత్కాలికంగా దుకాణాల ఏర్పాటుకు టెండర్లు స్వీకరిస్తున్నట్టు ఈఓ డి.నాగమల్లేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరి కాయలు, అరటి పండ్ల దుకాణానికి రూ.లక్ష ధరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్ ఉండాలన్నారు. హోటల్ నిర్వహణకు రూ.లక్ష ధరావతు, రూ.10 లక్షల స్వాల్వెన్సీ, పండ్ల దుకాణానికి రూ.25 వేల ధరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ, ఆవు నెయ్యి దీపాల దుకాణానికి రూ.25 వేల ధరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ, పాదరక్షల దుకాణానికి రూ.25 వేల ధరావత్తు, రూ.రెండు లక్షల సాల్వెన్సీ, వాహనాల పార్కింగ్ ఫీజు వసూలుకు రూ.రెండు లక్షల ధరావత్తు, రూ.10 లక్షల సాల్వెన్సీ, కొబ్బరి చిప్పలు తీసుకోవడానికి రూ.లక్ష ధరావత్తు, రూ.ఐదు లక్షల సాల్వెన్సీ, మామిడి కాయలు కోసుకోవడానికి రూ.రెండు వేల ధరావత్తు, రూ.50 వేల సాల్వెన్సీ ఉండాలన్నారు. ఈ నెల 30న ఉదయం 10లోపు టెండరు వేసి, తదుపరి బహిరంగ వేలంలో పాల్గొనాలన్నారు. ఈ నెల 27లోగా రూ.వెయ్యి చెల్లించి, టెండరు షెడ్యూల్ పొందాలని తెలిపారు.